అంబాలీస్

శ్రీ బి. పి. కరుణాకర్

హరిజన హాస్టల్‌కూ నరసయ్య పవుల్ట్రీకూ కంచె అడ్డం. పవుల్ట్రీ లోపలకు వెళ్లాలంటే మామిడి తోటదాటి చుట్టూ తిరిగివెళ్లాలి. తడికెగేటు క్ర విరిగి ప్రక్కకు ఒరిగి ఉంది. లోపలకు నడిచాను. కోళ్ల గోల. చెట్టుక్రింద నీళ్లు నిలిచి మురుగువాసన వేస్తోంది. నరసయ్య ఇంట్లో ఉన్నాడో లేదో తెలియదు. అరుగు మీద ఈజీ ఛేయిర్‌లో ఒకామె కూర్చునిఉంది. ఆమె ఎర్రగా ఉంది. నల్లంచు తెల్లటిచీరలో శుభ్రంగాఉంది. ఈజీ ఛేయిర్ ప్రక్కనే పొడుగాటిబల్ల ఉంది. బల్లకు అటుచివర మరో ఆమె కూర్చునిఉంది. ఈమె చామన చాయలో ఉంది. ఉంగరాలు జుట్టు గుండ్రటి కళ్లు. ఇద్దరి వయస్సూ ముప్ఫయి సంవత్సరాల లోపు ఉండొచ్చు.

అరుగు ఎక్కాను. 'నా పేరు రంగారావు. ఈ ఊరి హయిస్కూల్లో సయిన్సు టీచర్‌గా పని చేస్తున్నాను' అన్నాను.

అని ఇద్దరివంకా చూశాను.

బల్లచివర కూర్చున్న అమె చిన్నగా పెదిమలు విప్పింది. పెదిమలు ఎర్రగా ఉన్నాయి. తడిగా ఉన్నాయి. 'నాపేరు సీత. చెన్నూరులో మిడ్‌వయిఫ్‌గా పనిచేస్తున్నాను. వీరి పేరు వీరాబాయి. మా బ్లాక్ ఎస్. ఇ. ఓ'అంటూ ఈజీ ఛెయిర్‌లో కూర్చున్నావిడను చూపించింది.

నమస్కార, ప్రతినమస్కారాలు అయినాక 'కూర్చోండి' అన్నది వీరాబాయి.

బల్లకు ఈ చివర కూర్చున్నాను. బల్ల సరిగా లేదు. మధ్యలో ఎత్తుగాఉంది. కదులుతోంది. ఆరు కావస్తోంది. చీకటి పడుతోంది.

'నరసయ్యగారు లేరా?' అడిగాను.

'ఇప్పుడే రెడ్డిగారిదగ్గరకు వెళ్లారు. వెంటనే వస్తానన్నారు.' అన్నది వీరాబాయి.

సీత పేపరు చదువుతోంది.

'ఎప్పుడు వచ్చారు?'

'రెండుగంటలప్పుడు వచ్చాం.'

'మంచిఎండలో వచ్చారు. విజిట్ పూర్తి చేసేసేరా ?'

వీరాబాయి తలూపింది.

'పోయిన సంవత్సరం చివర్లో ఓ సారి బంజర వచ్చాం. మీ రప్పుడు ఇక్కడ లేరు. అవునా ?' అడిగింది సీత పేపరు మడుస్తూ.

'అవును'

'మునుపెక్కడ పనిచేశారు?'

'ఎక్కడా పనిచేయలేదు. ట్రయినింగ్ అయిన తర్వాత చినకోరుకొండిలోనే ఫస్టు అపాయింట్‌మెంట్'

'ఎలాఉందీ ఊరు?'

'ప్స్'

'మీదే ఊరు ?'

చెప్పాను.

'అబ్బో! చాల దూరంనుండి వచ్చారే'

'తప్పలేదు మరి—అన్నట్లు మీ ఇద్దరికీ వో సంగతి చెబుదామని వచ్చాను' అని వీరాబాయి ముఖం లోకి చూశాను.

'చెప్పండి' అన్నది వీరాబాయి.

'ఈ రాత్రికి మీ రిక్కడే ఉండిపోతున్నారు కదా'.

తలూపింది.

'రేపు ఉదయం తిరిగి చెన్నూరు వెళ్లిపోతారు. అవునా?'

'అవును'

'ఈ రాత్రికి మీ రిద్దరూ మా హాస్టల్‌లో భోజనం చేయాలి'

'హరిజన హాస్టల్‌లోనా?' అడిగింది సీత.

'అవును'

'హాస్టల్‌కు మీరు వార్డెనా?'

'కాదు. కృష్ణారెడ్డి అని తెలుగుమాస్టారు ఈ హాస్టల్‌కు వార్డెన్. ఆయన చినకోరుకొండిలోనే ఉంటారు. నాకు ఎక్కడా ఇల్లు దొరకక పిల్లలతో పాటు హాస్టల్‌లోనే ఉంటున్నాను.'

'మీకు పెళ్లికాలేదా?'

'లేదు. భోజనంమాట మర్చిపోరు కదూ?'

'లేదు.' అన్నది వీరాబాయి.

'మీకు స్నానానికి నీళ్లు పెట్టించాక ఏకుర్రాడి చేతనయినా కబురు పంపిస్తాను. మీకు హాస్టల్‌లోనే పడక ఏర్పాటు చేయిస్తాను సరేనా?'

'సరే. మీకు చాలా శ్రమ ఇస్తున్నాము'.

'నథింగ్. ఇందులో శ్రమఏమీ లేదు' అని లేచి అరుగుదిగి తిరిగి హాస్టల్‌లోకి వచ్చేశాను.

బంజరలోగాని చినకోరుకొండిలో గాని హోటళ్లు లేవు. బంజర చినకోరుకొండికి మయిలు దూరంలో ఉంది. మంచిరోడ్లు లేవు. చెన్నూరు బి. డి. ఓ. ఆఫీసునుండి ఏ ఉద్యోగులయినా విజిట్‌కు గాని, ఇనస్పెక్షన్‌కుగాని రావాలంటే అంతదూరం నడుచుకుంటూ రావాల్సిందే. వర్షాకాలాల్లో అయితే మరీ కష్టంగా ఉంటుంది. ఈ రెండు గ్రామాలూ రెండు ద్వీపాల్లా తయారయి పోతాయి. ఉత్తరాలు రావు. ఉత్తరాలు పోవు. దినపత్రికలూ అంతే !

వీరాబాయి, సీత భోజనాలు ముగిసేసరికి రాత్రి తొమ్మిది దాటింది.

పిల్లలు వరండాలో కూర్చుని చదువు కుంటున్నారు. బయట వెన్నెల చిక్కగా కురుస్తోంది. గాలి చల్లగా వీస్తోంది. వీరాబాయి వరండాలోఉన్న మంచం మీద కూర్చుంది. నేను కుర్చీలో కూర్చున్నాను. సీత తలుపు దగ్గరున్న స్టూలుమీద కూర్చుంది. పిల్లలు చదువుకోవటం మానేసి వారిద్దరివంక చూడసాగారు.

'మీ హాస్టల్‌లో ఎంతమంది ఉంటున్నారు?' అడిగింది వీరాబాయి.

చెప్పాను.

'మేనేజరు ఎవరు?'

'ఏసురత్నం అని ఊటుకూరులో ఉంటున్నారు.'

'చూడ చూడ మీ పిల్లలు చాల బుద్ధిమంతుల్లా కనిపిస్తున్నారు' అన్నది సీత.

'మరి ఏమిటనుకున్నారు. మా పిల్లలు అన్నిట్లోనూ మొదటఉంటారు' అన్నాను.

'వెరీ గుడ్. ఆటల్లోనో?'

'ఆటల్లో కూడా'

'పాటల్లోనో?'

'ఓ యస్'

'అయితే ఎవరినయినా ఒక పాట పాడమనండి. విందాం.'

ఓ యస్ అని అనటానికి అన్నానుకాని అది నిజంకాదు. గతుక్కుమన్నాను. మా హాస్టల్ పిల్లల్లో ఎవరు బాగా పాటలు పాడగలరో నిజానికయితే నాకు తెలియదు. పిల్లలవంక చూసేను. అందరి ముఖాల్లో నవ్వుగుర్తు కనిపిస్తోంది. ఉత్సాహంగా ఉన్నారు.

'మా వాళ్లు ఊరకనే పాడరు' అన్నాను నెమ్మదిగా.

'లంచం తింటారా ఏమిటి?' చటుక్కున అడిగింది సీత.

'అవును.'

'ఛ్ఛి. ఛ్ఛి. నో యూజ్. లంచాలు తినటం మీరు చిన్నప్పటినుండే పిల్లలకు నూరిపోస్తున్నారా ఏమిటి?'

'పెద్దమాటే వదిలారు. నా ఉద్దేశం వేరు. లంచంఅంటే ఇక్కడ ముందు ఎవరయినా పాట

పాడితే ఆ తర్వాత మా పిల్లలు పాట పాడతారు. కదండ్రా.'

'ఆఁ' అన్నారంతా.

వరండాలోకి కొత్తగాలి ప్రవేశించినట్లుగా ఉంది.

'—అంటే మీ ఉద్దేశం మా ఇద్దరిలో ఎవ రయినా ముందోపాట పాడాలి. అంతేనా?'

'అంతే.'

'నాకు పాటలు రావు. నామటుకు నేను ఉత్తి బాత్‌రూం సింగర్‌ను.'

'వీరాబాయిగారూ—మీరో?'

'డిటో' అన్నది వీరాబాయి.

సీత గలగలమని నవ్వి, 'మీ అవస్థ నాకు అంతుపట్టింది. మీ హాస్టల్ పిల్లలకు ఎవరికీ పాటలు పాడటంరావని నిజం వప్పుకోండి. మేము ఏమీ అను కోము. ఏమంటారు వీరాబాయిగారూ?' అన్నది.

అవునన్నట్లు తలూపింది, వీరాబాయి.

సీత మాటల్లోని నిజం వప్పుకోటానికి నా మనసు గింజుకుంటోంది. సిగిరెట్ వెలిగించాను. సీతవంక చూశాను. ఆమె పెదాలు నవ్వుతున్నాయి. పిల్లలవంక చూశాను. నేనేం జవాబు చెబుతానో అన్నట్లు అందరూ అవుత్సకంగా నా ముఖంలోకి తేరిపార చూస్తున్నారు. మీలో ఎవరు పాటలు బాగా పాడతార్రా అని అప్పుడు అడగటానికి సిగ్గువేస్తోంది. గొంతు సవరించుకుని, 'లేదు. మావాళ్లు చక్కగా పాడతారు' అన్నాను.

'అయితే ఎందుకాలస్యం? పాడించండి' అన్నది సీత.

పిల్లలవంక చూశాను. వరండాచివర్లో కూర్చున్న శేషయ్య లేచి నుంచున్నాడు. చేతులు కట్టుకుని, 'సార్! నేను పాడతానండీ' అన్నాడు.

తేలికగా గాలి పీల్చుకుని 'పాడు' అన్నాను.

శేషయ్య చిన్నగా రెండుసార్లు దగ్గి, పాట మొదలుపెట్టాడు: 'అందాలసీమా సుధానిలయం... ఈ లోకమే దివ్య ప్రేమమయం...' చదువుల్లో ఎప్పుడూ వెనకఉండిపోయే శేషయ్య కంఠస్వరం ఇంత మధురంగా ఉంటుందని నేను ఊహించనయినా లేదు. ఆ పూట వాడు నాకు ఎంచేతో కొత్తగా అవుపించ సాగాడు. పాట అయిపోయింది. అప్పుడే అయి పోయిందా అనిపించింది. వరండాచప్పట్లతో మారు మ్రోగింది.

'చాలా బాగాపాడాడు. అబ్బాయ్! ఏంపేరయ్యా నీది?' అడిగింది సీత.

'శేషయ్యండి'

'వెరీగుడ్. ఇంకో పాటపాడు'

'మీరు పాడండి' అన్నాడు శేషయ్య.

'అవును. ఈ సారి వంతుమీది. మీరు పాడాలి' అన్నాను.

'నేను ముందే చెప్పానుకదా. నాకు పాటలు రావని'

'కాదు. కాదు. మీరు పాడాలండోయ్' అన్నాడు మరో కుర్రాడు.

'సయిలెన్స్' అన్నాను.

గాజులు కదులుతున్న చప్పుడు మినహాయించి వరండా నిశ్శబ్దంగా ఉంది.

సీత తలవంచుకుంది. కాలి బొటనవ్రేలితో నాపరాయి మీద రాస్తూ 'మనసున మల్లెల మాల లూగెనే' ఎత్తుకుంది. చక్కటి కంఠస్వరమే గాని మాటలు వత్తి వత్తి పలుకుతోంది. పాటకు ఉండ వలసిన సొంపుదనం రావటంలేదు. ఒక వచనం ముగించి రెండో వచనం మొదలుపెట్టగానే పిల్లల్లో ఒకడు కిసుక్కున నవ్వాడు. దాంతో అందరూ నవ్వారు. సీత పాట ఆపివేసింది. ఆ తర్వాత ఎంత బ్రతిమిలాడినా మళ్లీ పాడలేదు.

పదిన్నరవరకు పాటలతో, పద్యాలతో, కబు ర్లతో కాలం తెలియకుండా గడిచిపోయింది. లయిట్లు ఆర్పివేసి అందరూ పడకలమీద చేరారు. నేను బయ టకువచ్చి బావిప్రక్కనేఉన్న బండమీద కూర్చున్నాను. మామిడితోటలోంచి గాలి హోరుమని వీస్తోంది. సిగిరెట్ వెలిగించి వెన్నెల చల్లదనంలో తడుస్తున్నాను.

కొద్దిసేపటికి ఎండిపోయిన ఆకులమీద ఎవరో నడిచిన శబ్దం వినిపించింది. తలతిప్పి చూశాను. వీరాబాయి బావివయిపు వస్తున్నట్లు అనిపించింది.

నా హృదయస్పందన లిప్తకాలంపాటు స్తంభించి నట్లయింది. పరీక్షగా చూశాను. సీత! తెల్లటిచీరలో దేవతలా నేను కూర్చున్నచోటుకు వచ్చింది.

'ఏమిటిక్కడ కూర్చున్నారు?' అడిగింది.

'ఏమీలేదు.' అన్నాను.

'వెన్నెల బావుందికదూ!' అన్నది.

నా వెన్నులో చలి బయల్దేరి శరీరమంతా ఆక్రమించుకుంది. తలూపాను.

చేతులు కట్టుకుని తల పయికెత్తి నాలు గయిదు క్షణాలపాటు చంద్రుడివంకచూసి నిట్టూర్చింది.

'మీకు నిద్రపట్టటంలేదా?' అడిగాను.

నావంకచూసి, 'ఊహు' అని తల అడ్డంగా ఆడించింది. చెవులకున్న దుద్దులు వెన్నెల వెలుగులో మెరిశాయి.

'కొత్త ప్రదే......'

నా మాటలకు—అడ్డువచ్చి, 'కొత్తప్రదేశం మాట అలా ఉంచండి. మీరిచ్చిన మంచంలో నల్లులు మస్తుగా ఉన్నాయి' అన్నది.

కూర్చోండి అందామనుకున్నానుకాని అనలేదు.

'మీ రెందుకు నిద్రపోలేదు?' అడిగింది.

'నే నెప్పుడూ ఆలస్యంగా నిద్రపోతుంటాను. రోజూ పన్నెండున్నర, ఒకటి అవుతుంటుంది.'

సీత ఏదో గుర్తు వచ్చినట్లు వాచీవంక చూసుకుని 'గుడ్‌నయిట్' అని నా జవాబుకోరకు ఎదురు చూడకుండా ఎండిన ఆకులమీంచి నడుచుకుంటూ హాస్టల్‌వయిపు వెళ్లిపోయింది. నా మనసుచుట్టూ ఆలోచనలు గుంపులు గుంపులుగా వచ్చిచేరాయి.

ఆ మరుచటిరోజు ఉదయం నేను స్కూలుకు బయల్దేరే సమయానికి వీరాబాయి, సీత చెన్నూరు ప్రయాణ మయ్యారు. ఓ పదిరోజులవరకు రోజూ ఇద్దరూ గుర్తు వచ్చేవారు. ఆ తర్వాత వారిసంగతే మర్చిపోయాను.

రెండునెలలు గడిచాయి.

ఒకరోజు మిత్రుడు వెంకటరామయ్య పెద్ద కోరుకొండినుండి బంజరవచ్చి నన్ను వాళ్ళఊరు తీసుకు వెళ్ళాడు. ఒక రోజంతా అతనింట్లోనే ఉన్నాను. ఆ మరుచటిరోజు ఆదివారం ఆ మధ్యాహ్నం భోజనాలు ముగించుకుని నేను, వెంకటరామయ్య సయికిళ్ళు ఎక్కి అతని తోటలను చూసేందుకు బయల్దేరాం. అతని తోటలు ఊరి పొలిమేరలో ఉన్నాయి. రెండు మూడు గంటలపాటు మిరపతోటలో గడిపాం. ఆ తర్వాత ఏం చేయాలో తోచలేదు.

'చెన్నూరువెళ్దాం పద' అన్నాడు వెంకటరామయ్య.

నాకు వెంటనే వీరాబాయి సీత గుర్తువచ్చారు.

'ఇక్కడ కెంతదూరం ఉంటుంది?' అడిగాను. చెప్పాడు.

'సాయంత్రానికల్లా తిరిగి వచ్చేయగలం కదా'

'ఆహా'

'సరే' అన్నాను.

సయికిళ్లమీద బయల్దేరాం.

ఎండ పల్చగా ఉంది.

మట్టిరోడ్డు గతుకులు గతుకులుగా ఉంది.

'నీకు చెన్నూరు బాగాతెలుసా?' అడిగాను.

అతను పకపక నవ్వి 'భలేవాడివి. నీకు కొత్త అని నాకూ కొత్త అనుకుంటున్నావా? ఎందుకు తెలియదు? మా చెల్లెల్ని చెన్నూరులోఇచ్చాం' అన్నాడు.

'నీకు వీరాబాయి తెలుసా?'

'ఎస్. ఇ. ఓ. కదూ?'

'అవును.'

'తెలుసు. ఏం?'

'ఏంలేదు. ఊరికనే అడుగుతున్నాను.'

'కాని వీరాబాయి ప్రస్తుతం చెన్నూరులో లేదు. పదిరోజులక్రిందట బదిలీఅయి ఖమ్మం—అవతల ఏదో బ్లాక్‌కు వెళ్లిపోయింది. చాలా మంచిమనిషి. అయినా నీకు వీరాబాయి ఎలా తెలుసు?'

'వీరాబాయీ, సీతా ఒకసారి బంజర వచ్చారు.'

'సీత కూడానా?'

'ఆఁ'

అతను గమ్మత్తుగా ఈలవేసేడు. ఆ ఈల వేసిన పద్ధతి గమనిస్తే సీత అంటే చులకన అభి ప్రాయం అతనికి ఉన్నట్లు అనిపించింది.

'మరి సీతను ఓ చూపు చూడలేదా ?' అన్నాడు.

నా వీపుమీద ఎవరో బలంగా చరిచినట్లు అని పించింది.

'సీత హృదయం బహు విశాలమయినదిలే. ఏమడిగినా కాదనదు. వాళ్లది కొత్తగూడెం దగ్గిర చిన్న పల్లెటూరు. ఆ ఊరుపేరు నోట్లో ఉందిగాని... రావటంలెదు...సరే. పాపం. వాళ్లింట్లోవాళ్లు ఈ సీత పెళ్లిగురించి పట్టించుకోరు. ఎవర్నో ఒకర్ని కట్టుకుని సెటిల్ అయిపోదామని బోలెడంత తాప త్రయముంది. పాణిగ్రహణం చేయటానికి ఎవరూ ముందుకురాలేదు సరికదా పెళ్లి చేసుకుంటామని చెప్పి ఇద్దరు ముగ్గురు ముందస్తుగా కాపురం పెట్టేసి చివరకు మోసంచేసి పెళ్లి చేసుకోలేదు. రెండు మూడు ఎబార్షన్‌లు అయినాయని విన్నాను. నిజమెంతో నాకు తెలియదు. ఇప్పుడు పెళ్లిభ్రమలో ఉందో, లేదో తెలియదు. అందినకాడకి అహహ...'

సీతమీది జాలితో గుండె నిండింది.

నలభయిఅయిదు నిమిషాల తర్వాత చెన్నూరు చేరుకున్నాం. చెన్నూరు మాఊరిలా మురికిగాఉంది. రోడ్లమీద అటూఇటూ తిరిగి వెంకటరామయ్య చెల్లెలు ఇంటికి వెళ్లాం. బావమరిది ఆదివారం కాబట్టి పీక వరకు తాగి తందనాలాడి అప్పుడే అడ్డంపడ్డాడు. గంట పయిగా అక్కడే కూర్చున్నాం. వెంకటరామయ్య చెల్లెలు సాయంత్రంవరకుఉండి భోజనంచేసి వెళ్ల మంటున్నా వినిపించుకోకుండా 'ఈసారి వచ్చినప్పుడు తింటాములే'అనిచెప్పి బయటకు నడిచాడు వెంకట రామయ్య. నేను అతన్ని అనుసరించాను.

బయటకువచ్చి సయికిళ్లు ఎక్కాం.

పెదకోరుకొండిరోడ్డు పట్టాం.

అరఫర్లాంగు వెళ్లాక వెంకటరామయ్య హఠా త్తుగా సయికిలు ఆపాడు. నేనూ ఆగాను.

'సీతను చూడదల్చుకోలేదా?' అడిగాడు.

సీతను చూడాలనిఉంది. నా అంతట నేను ఆ మాట చెప్పటానికి సంశయించాను. వెంటనే బయటపడిపోకుండా 'ఆఁ ఎందుకులెద్దూ!' అన్నాను.

'భలేవాడివి. ఇంతదూరంవచ్చి సీతను చూడ కుండా వెళ్లితే ఎట్లా'

'సీత ఇల్లు నీకు తెలుసా?'

'ఈ చెన్నూరులో నాకు తెలియనిది ఏమీ లేదు...కమాన్'

సయికిలు వెనక్కితిప్పాడు.

పదినిమిషాలు ప్రయాణంచేసి వెంకటరామయ్య ఓ తాటాకుల ఇంటిముందు సయికిలు ఆపాడు. సిమెంటుగోడప్రక్కన నీడలో సయికిళ్లు స్టాండ్‌వేసి బెల్ మోగించాడు. వెంటనే తలుపు తెరుచుకుంది. సీత మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయింది.

తలుపులు బార్లా తెరిచి 'రండి. రండి' ఆహ్వా నించింది.

లోపలకు నడిచాం.

గచ్చునేలమీద ముగ్గులు మోడరన్ ఆర్ట్‌లా చిక్కిరిబిక్కిరిగా ఉన్నాయి. చిన్నఇల్లు అయినా శుభ్రంగా ఉంది.

దుప్పటి దులిపి మంచంమీదపరచి, 'కూర్చోండి' అన్నది.

కూర్చున్నాం.

'ఎలా ఉన్నారు?' అడిగింది.

'బావున్నాను. మీరో?' అన్నాను.

'అలా అలా'

'ఇతను...' అంటూ వెంకటరామయ్యను పరి చయం చేయబోయాను. సీత నా మాటలకు అడ్డు వచ్చి, 'నాకుతెలుసు. మీరు శివకామయ్య బావగారు కదూ!' అడిగింది అతన్ని.

అతను నవ్వి తలూపాడు.

మంచినీరు ఇచ్చింది.

పుచ్చుకున్నాం.

ప్రక్కింటి పిల్లవాడిని పిలిచి మేము వద్దం టున్నా వినిపించుకోకుండా వాడిచేతిలో రెండు రూపా

యల కాయితంపెట్టి హోటల్‌కు తరిమింది. అప్పుడు బంజర వచ్చిన సీతకూ,ఆ సీతకూ సహస్రాంశం తేడా సుస్పష్టంగా కనిపిస్తోంది. మనిషి నలిగిపోయినట్లు కనిపిస్తోంది.

పావుగంట తర్వాత కుర్రాడు హోటల్‌నుండి పకోడి, టీలుతెచ్చాడు. ముగించాక ఓ గంటసేపు పిచ్చి పాటిలోపడి ఆ తర్వాతలేచి 'మేమికవెళ్తాం' అన్నాను.

'అప్పుడే?'

'ఆఁ'

'బావుంది మీ మర్యాద. మీరు ఈ రాత్రికి ఇక్కడే ఉండండి. రేపు ఉదయాన్నే వెళ్ళుదురుగాని'

'రేపు ఉదయాన్నే స్కూలుఉంది'

'సయికి లుందికదా. మీ ఊరికి ఇక్కడనుండి రెండుగంటల ప్రయాణం. స్కూలుకు అందుకో గలరు. ఈ రాత్రికి మీ రిక్కడ భోజనంచేసి వెళ్ళాలి తప్పదు.'

'అట్లా అయితే మీరు నాకు సెలవిప్పించండి' అన్నాడు వెంకటరామయ్య.

'సరే' అన్నది సీత.

నేను, వెంకటరామయ్య కలసివచ్చాం. నన్ను భోజనంచేసి రేపు వెళ్లమంటోంది. అతన్ని భోజనానికి కూడా ఉండమనటంలేదు. కారణం నాకు అర్థం కావటం లేదు. నన్నువదలి అతను వెళ్లిపోవటం నాకు అయిష్టంగా ఉంది.

'నేనూ వస్తున్నాను' అన్నాను అతనితో.

'నువ్వుండు. రేపుఉదయాన్నే రా' అని బయట కొచ్చి సయికిలు అందుకున్నాడు.

'మాట' అన్నాను.

నా కళ్లల్లోకి సూటిగాచూసి కనుగీటి సయికి లెక్కి వెళ్లిపోయాడు వెంకటరామయ్య.

అప్పటివరకు సందడిగాఉన్న ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. మంచంమీద కూర్చున్నాను. సాయంకాలపు ఎండ. తలుపుచెక్కకు ఆనుకుని నుంచుంది సీత. స్టూలుమంచానికి దగ్గిరకు లాక్కుని కూర్చుంది. తను పరీక్షగా చూశాను. సీత అందగత్తే!

'ఏమిటలా చూస్తున్నారు?' అడిగింది.

'ఏమీలేదు' తలఅడ్డంగా ఆడించాను.

'నేనంటే మీకు భయమా?'

'లేదు. లేదే. భయమని అన్నానా?'

'అతనితోపాటు మీరూ వెళ్లిపోదామని అనుకో లేదూ?'

'అనుకున్నాను. మీకు శ్రమ ఇవ్వటం ఎందుకు చెప్పండి!'

'ఇందులో శ్రమ ఏమీలేదు'అని నవ్వింది.

ఆ నవ్వు సమ్మోహనంగా ఉన్నట్లనిపించింది.

ఆ రాత్రి భోజనాలు ముగిసేసరికి తొమ్మి దయింది. భుక్తాయాసంచేత నేను మంచంమీద పడు కున్నాను. సీత స్టూలుమీద కూర్చుని చెన్నూరు కబుర్లు, కొత్తగూడెం విశేషాలు చెబుతోంటే అన్ని మయిళ్లు ఎండలో సయికిలు తొక్కటంవలన, కడుపు నిండా భోజనం చేయటంవలన, సీత మాటలు మయికంలో పనిచేయటంవలన వింటూనే నిద్రాదేవి ఒడిలోకి జారిపోయాను.

ఎంతసేపలా నిద్రపోయానో తెలియదు. సీత నన్ను తట్టిలేపుతోంటే కళ్లు తెరిచాను. మత్తుగా ఉంది. చల్లటిగాలి వీస్తోంది. లేచి కూర్చున్నాను. కాళ్ళు, నడుం నొప్పిగా ఉన్నాయి. వాచీ చూసు కున్నాను. పదకొండూనలభయి అయింది. గదిలో హరికేన్‌లాంతరు వెలుగుతోంది. సీతవంక చూశాను. సీత మంచంమీద కూర్చుంది. రవికెలేదు. తెల్లటి సిల్కుచీర కట్టుకునిఉంది. లోపల లంగాలేదు. నామత్తు ఒక్కసారిగా వదిలింది.

'నిద్రపోయేందుకా మిమ్మల్ని ఇక్కడ ఈరాత్రికి ఉండమన్నది?' అన్నది సీత.

ఆమె కంఠస్వరంలో మార్పు గమనించాను. ఆమె నన్ను ఆనుకుని కూర్చుంది. సన్నటి వణుకు గుండెలో ప్రారంభమయి రక్తంలో కలిసింది.

'నా ప్రశ్నకు జవాబు చెప్పరేం?' అన్నది మోచేత్తో నన్ను పొడుస్తూ.

నవ్వాను.

ఆ నవ్వు నా పెదిమలచివర విరిగిపోయింది.

నా కుడిచేయి అందుకుని చుంబించింది. సీత ఎఱ్ఱటి పెదిమలలోని మందోష్ణం నా చేతిలోని రక్తానికి తగులుతోంది. నా గుండె వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టింది. నా నుదురు స్వేదపూరితం కాసాగింది. వణుకుతున్నాను. చటుక్కున నాచేయి తన ఛాతీమీద వేసుకుని జారిపోకుండా తనచేత్తో అదుముకుంటోంది.

'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను'. నా చెవిలో అతి నెమ్మదిగా రహస్యం చెబుతున్నట్లు అన్నది.

టన్నురాళ్లు నా గుండెలో ఒక్కసారిగా పడినట్లు అనిపించింది.

'నిజం. మరి మీరో?'

నా గొంతులోని పచ్చి వెలగకాయ కదలటం లేదు.

సీత నా జవాబుకొరకు ఎదురు చూడలేదు. నా బుగ్గమీద చుంబించింది. 'మీ రంటే నాకు చాలా ఇష్టం. అందుకనే మిమ్మల్ని ఇక్కడ ఉండమన్నాను.' అన్నది. అని నన్నువదిలి మంచంమీద పడుకుని చేతులు చాపింది.

నా గుండె మంచులా తయారవుతోంది.

సీత ముందుకువంగి నామెడచుట్టూ చేతులు వేసి నన్ను తనమీదకు లాక్కుంది. ఆమె గుండెమీద నా తల. ఆమెగుండె కొట్టుకోవటం నాకు వినిపిస్తూ ఉంది.

రెండు క్షణాలాగి సీత చటుక్కున లేచింది. ఆమె హఠాత్తుగా ఎందుకులేచిందో నాకు అర్థం కాలేదు. ఆమె ముఖంలోకి చూశాను. సీత నావంక చూడటంలేదు. లేచి మంచందిగి గోడ కానుకుని స్టూలుమీద కూర్చుని — ఆ చుట్టుప్రక్కల ఇళ్ల వాళ్లకు వినిపించేలా—ఉన్నట్టుండి—పెద్దగా 'వదలండి. వదలండి'అని అరిచింది.

సీతకు దయ్యంగాని పట్టిందా అనుకున్నాను. నా గుండె వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టింది. చటుక్కునలేచి కాళ్లు తపతప నేలకేసికొడుతూ, 'నన్నేమని అనుకున్నారు? గాలిదాన్నని అనుకున్నారా?' అడుగుతోంది నన్ను.

ఉలిక్కిపడ్డాను. నా పరిస్థితి కొంచెం కొంచెంగా నాకు అర్థమవుతోంది. సీత అతినేర్పుగా నన్ను పద్మవ్యూహంలోకి లాగటంలేదు. మొరటుగా లాగుతోంది. సీత మరోసారి గట్టిగా అరచిందంటే చుట్టుప్రక్కల ఇళ్లు మేలుకుంటాయి. ఇది నా ఊరుకాదు. సీత మాటలనుకాకుండా నా మాటలను నిజంగా పరిగణిస్తారని నమ్మకం ఏమిటి?

సీత తలుపు తెరిచింది. గొంతు మరింత పెద్దగావిప్పి, 'నువ్వింత గాలివాడవని తెలిసిఉంటే నా ఇంట్లోకి అడుగుపెట్టనిచ్చేదాన్నికాదు. ఎంత చదువుకున్నా గాలిమనుషులకు గాలిబుద్ధులు ఎక్కడికి పోతాయి? ఛీ ఛీ...'అంటూ శాపనార్థాలు పెడుతోంది.

నాకు ముచ్చెమటలు పోస్తున్నాయి. ఊహించని విధంగా గొడవపడుతున్నాను. పర్యవసానం ఎలా ఉంటుందో—అనూహ్యంగాఉంది. ఏంచేయటం? పరిస్థితి రభస అయ్యేట్టుగాఉంది. కాళ్లు వణుకుతున్నాయి. మంచందిగి నా గుడ్డలు అందుకుని తొడుక్కున్నాను. అంతరాత్రిలో పెదకోరుకొండి ఎలా వెళ్లటం? గుండె భయంతోనిండి పొర్లుతోంది. ఓట్రించె స్త్రీలతో ఏవిధంగా మాట్లాడాలో నాకు తెలియదు.

'అంతకోరికగాఉంటే పెళ్లిచేసుకోవచ్చుగా—పెళ్లిమటుకువద్దుగాని వళ్లు కావాలి. సిగ్గూశరమూ ఉండాలి మనిషికి...' అంటోంది.

నా పెదిమలు విపరీతంగా వణుకుతున్నాయి. సీత కళ్లల్లోకి తీక్షణంగా చూశాను. చేతులు తిప్పుతూ, 'కలేజాఉంటే పెళ్లిచేసుకుని చూపించు...' అన్నది.

గొంతు సవరించుకుని, ధైర్యం పుంజుకుని 'నేను పెళ్లిచేసుకోలేను. మిమ్మల్నే కాదు. ఎవరినయినా...నా కసలు పెళ్లిచేసుకునే అదృష్టమేలేదు' అన్నాను.

వెంటనే విసురుగా ఏదో అనబోయింది కాని అనలేదు. ఆమెముఖంలో రంగులు మారాయి. పాలపొంగుమీద నీరుపడినట్లు చల్లబడింది. నా మాటలు నమ్మలేనట్లు తల అడ్డంగా ఆడించింది.

'నిజం' అన్నాను.

'అదేమిటి?'

'నాలుగు సంవత్సరాల క్రిందట ఓ ట్రయిన్ ఏక్సిడెంట్‌లో నాకు దెబ్బతగిలింది. నేను సాంసారిక జీవితానికి పనికిరాను' నెమ్మదిగా అన్నాను.

సీత కొద్దిసేపటివరకు నా కళ్లల్లోకి సూటిగా చూస్తూండి పోయింది. చివరకు నిట్టూర్చింది. అంతే. పల్లెత్తి నన్ను మరోమాట అనలేదు. నిశ్శబ్దంగా పావుగంటసేపు కూర్చుండి పోయింది. ఆ తర్వాత తలుపు గడియవేయ బోతోంటే—

'నేను వెళ్తాను' అన్నాను.

'ఇంత రాత్రా?'

తలూపాను.

'వద్దు. ఇంతరాత్రప్పుడు వద్దు. రేపు ఉదయాన్నే వెళ్లండి' సౌమ్యంగా అన్నది.

'సరే'

తలుపు గడియవేసి లయిటు వత్తితగ్గించి చాప మీద పడుకుంది.

కొద్దిసేపయిన తర్వాత ఆమె చిన్నగా ఏడుస్తున్నట్లు అనిపించింది.

నాకు ఈ కథ రంగారావుచెప్పి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నది. రంగారావు గుర్తు వచ్చినప్పుడల్లా నాకు సీతకథ గుర్తు వస్తుంటుంది. సీతకు ఇప్పటికయినా పెళ్లి అయిందో, లేదో నాకు తెలియదు. కాని ఈ కథమీద నా అనుమానాలు నాకు ఇప్పటికీ ఉన్నాయి. అందులో ఒకటి రంగారావు నాణానికి ఇవతలివయిపే చూపించేడు. అవతలి వయిపులో నిజం ఎంతఉందో తెలియదు. రెండు: రంగారావు అబద్ధాలు ఆడడనికాదు-సీత అలా ప్రవర్తించి ఉంటుందా ? మూడు: రెండున్నర సంవత్సరాల క్రిందట రంగారావు తన మేనమామకూతుర్ని పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడు అతనికోపాప. ఆ పాప పేరు సీత.